క్లుప్తంగా

ఘనంగా శ్రీ దానమ్మ జాతర

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఆగర్రులో ఉన్న శ్రీ దానమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. మాంసాహారంతో పాటు, పిండి వంటలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదాలుగా వడ్డించారు. సుమారు వెయ్యి మంది భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, పెదగోపురం చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, శ్రీ దానమ్మ తల్లి అమ్మవారి సంఘ పెద్దలు రాచమళ్ల మీరయ్య, మిద్దే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ కార్యాలయం వర్గాలు ఆదివారం విలేకరులక తెలియాఃజ. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరించనున్నారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని సబ్ కలెక్టర్ కోరారు.

అమ్మవారికి పెన్నులతో అలంకరణ



అమ్మవారికి పెన్నులతో అలంకరణ చేసిన దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటేవారి తోటలోని విజయకనకదుర్గ బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారికి ఆదివారం రెండు వేల పెన్నులతో ప్రత్యేక అలంకరణ చేశారు. సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలలో భాగంగా ఆలయ అర్చకుడు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి పెన్నులతో అలంకరణ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పెన్నులను అందజేశారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్

ఆకివీడు: చీటింగ్, దొంగతనాలు, సెల్‌ఫోన్లు వంటి నేరాలకు పాల్పడకుండా జీవితాన్ని మార్చుకోవాలని డీఎస్పీ పీ.శ్రీనాథ్ హెచ్చరించారు. స్థానిక తెలగపాముల కులాలకు చెందిన పాత నేరస్తులకు ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా చీటింగ్ కేసులు నమోదవుతున్నాయన్నారు. నేరాలు మాని సత్ప్రవర్తనతో జీవించాలని డీఎస్పీ సూచించారు.

యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా గోపిమూర్తి

సాక్షి, భీమవరం: పట్టణానికి చెందిన బి.గోపిమూర్తి యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయ్యారు. విజయవాడలో రెండు రోజులు పాటు నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఆదివారం రాష్ట్ర కౌన్సిల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గోపిమూర్తి రెండోసారి రాష్ట్ర కోశాధికారిగా ఎన్నిక కావడంపై పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కడలి గంగిశెట్టికి కవురు నివాళి

వీరవాసరం: కమ్యూనిస్టు కురువృద్ధుడు కడలి గంగిశెట్టి ఇటీవల మృతి చెందడంతో ఆదివారం జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ నవుడూరులోని ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కవురు మాట్లాడుతూ సమాజ సేవ, సమాజ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేసిన మంచి మనిషి కడలి గంగిశెట్టి అని కొనియాడారు. తొలుత కడలి గంగిశెట్టి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కోడి అప్పారావు, కడలి మృత్యుంజయుడు ఉన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే ఉత్తమ ఫలితాలు

- నేటి నుంచి 10వ తరగతి పరీక్షలు
- పరీక్ష రాసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు



పెనుగొండ గురుకుల పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

పెనుగొండ: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఇప్పటి వరకూ ప్రణాళిక బద్ధంగా అభ్యాసన చేసిన విద్యార్థులను ఒత్తిడి నుంచి దూరం చేయడానికి ఆయా పాఠశాలల్లోనూ, పెనుగొండ గురుకుల పాఠశాలలోనూ ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే ఒత్తిడిని జయించి ఉత్తమ ఫలితాలు సాధించాలంటూ పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ మండలంలో 900 మంది, పెనుమంట్ర మండలంలో 502 మంది, ఆచంట మండలంలో 526 మంది, పోడూరు మండలంలో 480 మంది విద్యార్థులు సోమవారం పరీక్షలకు హాజరు కానున్నారు. ముఖ్యంగా గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లోనూ, జెడ్పీ పాఠశాలల్లోనూ జనవరి నుంచి ప్రత్యేక ప్రణాళిక ప్రకారం అభ్యసన, ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ, వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతుల నిర్వహణ చేయడంతో పాటు, రివిజన్ క్లాసులు చేపట్టి పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం చేశారు.

ఒత్తిడి జయించడానికి

ఒత్తిడి జయించడంతో పాటు, పరీక్షలకు సన్నద్ధం కావడానికి ప్రత్యేక టిప్స్‌ను నిపుణులు ద్వారా అందించారు. కొత్త అంశాలు నేర్చుకోవడానికి బదులు, వచ్చిన దానిపైనే దృష్టి సారించడం, ఒత్తిడి అనిపిస్తే కాసేపు రిలాక్స్ కావడం, పరీక్షలకు ముందురోజు రివిజన్‌కు సంబంధించి ముందుగానే గుర్తించుకోవడం, ఎక్కువ మార్కులు సాధించే అంశాలకు ఎక్కువ సమయం కేటాయించడం, ఫార్ములాలు, సాంకేతిక పదాలను తరువుగా అభ్యసన చేయడం, రివిజన్ చేసే సమయంలో పరీక్షా కేంద్రంలో ఉన్నట్లు ఊహించుకుని ముందుకు సాగడం వల్ల పరీక్షల సమయంలో ఒత్తిడిని అదుపులో పెట్టుకోవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. చేతి రాత ఒకే స్పీడులో సమాన స్ట్రోక్స్ ఇస్తూ రాయడం, నిర్లక్ష్యం వహించకుండా రాత శైలి, మార్జిన్లు పాటించడం, ప్రశ్నల నంబరులు, జవాబులు, స్పష్టమైన గుర్తింపు ఉండే విధంగా చూసుకోవడం, అక్షరాలు అసంపూర్తిగానూ, గజిబిజీగానూ లేకుండా అర్థమయ్యే రీతిలో రాయడం, పరీక్షా కాలంలో సరైన ఆహార అలవాట్లు పాటించడం, పరీక్షకు అరగంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గించడం, ఏకాగ్రత పెంచుకోవచ్చని పేర్కొంటున్నారు. పరీక్షా కాలంలో వచ్చే పుకార్లు, ప్రచారాలు నమ్మకుండా ఉండడం పరీక్షలపై దృష్టి సారించాలి.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నరసాపురం రూరల్: పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల విద్యాశాఖాధికారులు తెలిపారు. మండలంలోని 6 పరీక్షా కేంద్రాలకు సంబంధించి రెగ్యులర్ విద్యార్థులు 1850 మంది, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 117, ఒకేషనల్ విద్యార్థులు 31 మంది పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. మొగల్తూరు ఏ సెంటర్‌లో 115 మంది రెగ్యులర్, 3 గురు ప్రైయివేట్, బి కేంద్రంలో 190 మంది రెగ్యులర్, 46 మంది ప్రైవేట్, 31 మంది ఒకేషనల్ విద్యార్థులు, ముత్యాలపల్లిలో 197 మంది రెగ్యులర్, 21 మంది ప్రైవేట్, శేరేపాలెంలో 110 మంది రెగ్యులర్ విద్యార్థులు జగన్నాథపురంలో 80 మంది రెగ్యులర్, 24 మంది ప్రైవేట్, కేపీ పాలెంలో 150 మంది రెగ్యులర్, 23 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని అధికారులు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రంలోనూ తాగునీరు, టాయిలెట్స్, ప్రథమ చికిత్స, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచామని అధికారులు తెలిపారు.

జనవరి నుంచి ప్రత్యేక దృష్టి



గురుకుల పాఠశాలలో విద్యార్థులకు జనవరి నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ సన్నద్ధం చేశాం. ప్రీ ఫైనల్‌లో తక్కువ మార్కులు వచ్చిన వారిపై మరింత దృష్టి సారించాం. ప్రత్యేక ఆహారపు అలవాట్లు, ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకొనే విధంగా జాగ్రత్తలు తీసుకున్నాం.

– టి.ఎస్తేర్ క్వీనీ, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల, పెనుగొండ

ఒత్తిడికి లోను కాకూడదు



ఎటువంటి ఒత్తిడికీ లోను కాకుండా ఏకాగ్రత పాటిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చును, ఎగ్జామ్స్ టిప్స్ పాటిస్తే విజయానికి ఎదురుండదు. ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, ఏకాగ్రతగా ప్రశ్నలను అర్థం చేసుకొని, సరైన జవాబులు స్పష్టంగా రాయాలి. ఆహారపు అలవాట్లు సక్రమంగా పటిస్తూ, పరీక్షలకు కావలసిన అన్ని వస్తువులు అందుబాటులో ఉంచుకుని పరీక్షకు సిద్ధం అవ్వాలి.

– ఆక్కింశెట్టి రాంబాబు, సైకాలజిస్ట్

వైభవంగా ఉమా సోమేశ్వరుని కల్యాణోత్సవం



యలమంచిలిలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: స్థానిక శ్రీ ఉమాసోమేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చేగొండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు యలమంచిలి నరేంద్రశర్మ బ్రహ్మత్వంలో దేవేరుల కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. మధ్యాహ్నం ఉమా సమేత సోమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి పుర వీధులలో రథోత్సవం నిర్వహించారు. ఈ రథోత్సవాన్ని ఎంపీపీ రావూరి వెంకటరమణ, వెంకట కోటి మురళీకృష్ణ (బుజ్జి) దంపతులు ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మల్లుల బుజ్జి, తాళ్లూరి అబ్బులు, బర్రే రాంబాబు, గుబ్బల జగన్, యలమంచిలి సత్యనారాయణమూర్తి, ఈఓ నల్లూరి సతీష్‌కుమార్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా మట్టల ఆదివారం



మట్టలతో ఊరేగుతున్న శంభునిపేట క్రీస్తు లూథరన్ చర్చ్ సభ్యులు



సిద్ధాంతంలో మట్టలతో చిన్నారులు



లంకలకోడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



నక్కావారిపాలెంలో ర్యాలీకి వెళ్తున్న చిన్నారులు, సంఘీయులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పెదపేటలోని లూథరన్ చర్చ్‌లో మట్టల ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం లూథరన్ దేవాలయం నుంచి పిల్లలు, పెద్దలు అందరూ కలిసి మట్టలను పట్టుకుని పురవీధుల్లో తిరిగారు. శంభునిపేట క్రీస్తు లూథరన్ చర్చ్ నుంచి విశ్వాసులు మట్టలు పట్టుకుని ఇశ్రాయేలును స్తుతిస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లూథరన్ చర్చ్ పేరిష్ సంఘ కాపరి సుభూషణ్ బాబు, క్రీస్తు లూథరన్ చర్చ్ పేరిష్ పాస్టర్ గూడపాటి రాజేష్ కుమార్, కొల్లాబత్తుల సుదర్శన్ కుమార్, పీతల ఆనంద్ కుమార్, కొల్లాబత్తుల ప్రకాశరావు, తరపట్ల ఆనంద్, సంఘ సభ్యులు పి.జయరాజు, డి.దావీదు పాల్గొన్నారు.

సిద్ధాంతంలో

పెనుగొండ: క్రైస్తవ సోదరులు ఆదివారం మట్టల ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సిద్ధాంతం సెయింట్ థామస్ లూథరన్ చర్చి చెరువుపేటలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రెవరెండ్ ఏసురత్నం మాట్లాడుతూ రాజులకు రాజును, ప్రభువులకు ప్రభువును, నీతిపరుడైన ఏసుక్రీస్తు ప్రభువు ఏరుసలేంలోనికి ప్రవేశం చేసినపుడు ప్రజలు మట్టలతో ఘన స్వాగతం పలికి ఆహ్వానించారని మట్టల ఆదివారం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో చర్చి ప్రెసిడెంట్ చింతపల్లి జేమ్స్ , సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), పులిదిండి విజయకుమార్, నక్క పాల్, వినాయక్ మార్క్, మణిబాబు పాల్గొన్నారు.

పెనుగొండలో

పెనుగొండ రాజుగూడెంలో సెయింట్ జాన్ లూథరన్ సంఘం వద్ద మట్టల ఆదివారం వైభవంగా నిర్వహించారు. పాస్టర్ యు.బాబూ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సమస్త మానవాళి ద్వేషం, విద్వేషం విడనాడి అందరూ సమానమే అన్న బావమే మట్టల ఆదివారం అన్నారు. అనంతరం గ్రామంలో భారీ ప్రదర్శన చేశారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారం జరుపుకున్నారు. తిల్లపూడి, శివదేవునిచిక్కాల, పాలమూరు, అరట్లకట్ట, కాపవరం, ఆగర్తిపాలెం, ఆగర్రు, పెదమామిడిపల్లి, ఉల్లంపర్రు, పూలపల్లి, భగ్గేశ్వరం, చింతపర్రు, లంకలకోడేరు, దగ్గులూరు, వెలివెల తదితర గ్రామాల్లో ఈత మట్టలతో ర్యాలీ నిర్వహించారు. లంకలకోడేరు రూపాంతర దేవాలయం ఆధ్వర్యంలో పాస్టర్ బీవీ రత్నం విశ్వాసులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సీఆర్ ఎన్‌బీ ఆనంద్, సంఘ కార్యదర్శి కర్రి జోగయ్య, పీసీసీ పెద్దలు కత్తిమండ ఏసురత్నం, గోగులమండ ఆనందరావు, సంఘ కోశాధికారి విప్పర్తి ప్రభాకరరావు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని పాలపర్తివారిపేట, కొండావారిపాలెం, గోడావారిపాలెం, పిట్టావారితోట, నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఈత మట్టలతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక లూథరన్ ప్యారిష్ టూ పాస్టర్ తలారీ కొండయ్య మార్టిన్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో డెలిగేట్ బొడ్డుపల్లి సుబ్బారావు, ఆల్టర్‌నేటివ్ డెలిగేట్ కోనాల ప్రసాద్ పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: ఆదివారం క్రైస్తవ మతస్తులంతా మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని కృపానివాస్ ప్రేయర్ మినిస్ట్రీస్ అండ్ సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో పాస్టర్ మైలాబత్తుల విజయకుమార్ మట్టల ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ బి.శ్యామ్‌కుమార్, మద్దాల శ్యామ్ దుర్గాప్రసాద్, దేవాదుల భార్గవ్‌కుమార్, నల్లి రాజేష్, కలం మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదరించడం అభినందనీయం



బొండాడలో మల్లికార్జునరావును సత్కరిస్తున్న కళాకారులు

కాళ్ల: నాటక రంగ కళాకారులను వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ కందుల వెంకట మల్లికార్జునరావు ఆదరిస్తుండటం అభినందనీయమని రంగస్థల కళాకారిణి కిలారి లక్ష్మి అన్నారు. బొండాడలో కందుల లక్ష్మణస్వామి, లక్ష్మీతులసమ్మ దంపతులచే ప్రతిష్ఠించిన భద్రాద్రి శ్రీరామచంద్రస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. నాటకాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ నాటకంలో చంద్రమతిగా కిలారి లక్ష్మి, హరిశ్చంద్రులుగా కొప్పాడ కొండబాబు, వీఎస్ మాధవలు, నక్షత్రకుడిగా షణ్ముగ జే విజయకుమార్ రాజు, కాలకేశకుడు వీరబాహుడుగా మారుతి ప్రసాద్‌ల నటన ఎంతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రంగస్థల కళాకారిణి కిలారి లక్ష్మి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ కళాకారులను మల్లికార్జునరావు అక్కున చేర్చుకుంటున్నారన్నారు. కళాకారులతోపాటు ఉత్సవ కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు సుమారు 120 మందిని సత్కరించి మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దళిత, క్రైస్తవులకు శ్మశాన భూముల కేటాయింపు



ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న చింతలపల్లి గ్రామ దళితులు

పాలకొల్లు అర్బన్: దళితులు, క్రైస్తవులకు శ్మశాన భూములు కేటాయించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని, ఇప్పటికే రాష్ట్రంలో పెద్ద ఎత్తున శ్మశాన భూములు కేటాయించారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. రాజోలు మండలం చింతలపల్లి గ్రామ దళితులు ఆదివారం శ్మశాన భూమి సమస్యను ఆనందప్రకాష్ దృష్టికి తీసుకు వచ్చారు. గ్రామంలో గత 30 ఏళ్ల నుంచి శ్మశాన భూమిలో దళితులకు ఖననం చేసుకుంటున్నామని, అయితే ఆ గ్రామానికి చెందిన భూస్వామి ఒకరు తమ శ్మశాన భూమి ని ఆక్రమించుకుని ఖననం చేయకుండా అడ్డుకుంటున్నారని ఆనందప్రకాష్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి రాజోలు మండల తహసీల్దార్‌తో మాట్లాడారు. అలాగే అధికారికంగా ఆ శ్మశాన భూమినిని తాను సందర్శిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులకు, క్రైస్తవులకు శ్మశాన భూములు కేటాయింపులో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆనందప్రకాష్ వారికి వివరించి ధైర్యం చెప్పారు. ఆనందప్రకాష్‌ను కలిసిన వారిలో చింతలపల్లి గ్రామ దళిత సంఘ పెద్దలు బత్తుల సరస్వతి రావు, సోడదాసి బాబూరావు, బుడితి జగన్నాథం, తంగెళ్ల సీతారాముడు తదితరులున్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

భీమవరం అర్బన్: వేసవి దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు చెప్పారు. పెదగరువు పరిధిలోని చినగరువులో మండల పరిషత్ నిధులతో అభివృద్ధి చేసిన రక్షిత మంచినీటి చెరువుకు కాలువ ద్వారా నీటితో నింపే పనులకు ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రస్తుతం ఉన్న మంచినీటి చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడం జరిగిందని, వెంటనే చెరువును నీటితో నింపే పనులను కూడా ప్రారంభించామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మండలంలో ప్రతి పంచాయతీని కూడా సందర్శించి ఆయా గ్రామాలలో రక్షిత మంచినీటి చెరువులలో నీటి సామర్థ్యాన్ని పెంచే విధంగా కృషి చేయాలని ఎంపీపీ ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కనకారావు, సర్పంచ్ రావూరి లాజర్, బందెల శ్యామూల్, పైడి మోషేష్, కారేపల్లి మోహన్ పాల్గొన్నారు.